వామ్మో.. ఇవేం కల్వర్టులు ?

- పలుచోట్ల సాగర్ కాల్వలపై ఇక్కట్లు
- ప్రమాదాలకు నిలయంగా మారుతున్న వైనం
- అయినా పట్టించుకోని పాలకులు, అధికారులు



నర్సింహాపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



కేశిరెడ్డిపల్లి రోడ్డులో శిథిలమైన వంతెన



కల్వర్టు కిందిభాగంలో బయటకు తేలిన ఇనుప చువ్వలు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడు – రాజుపాలెం ప్రధాన రహదారిలో నర్సింహాపురం, ఎర్రుపాలెం – కేశిరెడ్డిపల్లి రోడ్డులో కేశిరెడ్డిపల్లి గ్రామాల సమీపాన రోడ్డు కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండడం.. పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. నర్సింహాపురం సమీపాన ఎన్నెస్పీ కెనాల్‌పై నిర్మించిన కల్వర్టు పూర్తిగా శిథిలమైంది. రెండు వైపులా రెయిలింగ్‌లు పూర్తిగా విరిగిపోయి కల్వర్టు కింద ఇనుప చువ్వలు తేలి కల్వర్టు వంగినట్లు కనిపిస్తోంది.

భారీ వాహనాల రాకపోకలు

బనిగండ్లపాడు – రాజుపాలెం మార్గంలోని నర్సింహాపురం కల్వర్టు మీదుగా పెద్దసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా.. 50 టన్నుల గ్రావెల్ లోడ్‌తో లారీలు వచ్చివెళ్తుంటాయి. దీంతో ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.64 లక్షలు మంజూరు చేసినా ప్రతిపాదనలకు సిద్ధం కాకపోవడంతో టెండర్ల దశకు చేరలేదు. ఇక ఎర్రుపాలెం నుంచి కేశిరెడ్డిపల్లికి వెళ్లే రహదారిలోని కల్వర్టుపై రెయిలింగ్‌లు శిథిలమయ్యాయి. ద్విచక్ర వాహనాలు, లారీలు ఈ రహదారి మీదుగా ఏపీలోని గూడెం మాధవరం గ్రామంలోకి వెళ్తాయి. ఆయా మార్గాల్లో ప్రమాదాలు జరగకముందే ఆర్అండ్‌బీ, ఎన్ఎస్పీ అధికారులు మరమ్మతులపై స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

నూతన కల్వర్టు నిర్మించాలి



బనిగండ్లపాడు – రాజుపాలెం మార్గంలో సాగర్ కెనాల్‌పై కల్వర్టు శిథిలమైంది. దశాబ్దాలుగా అలాగే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వాహనాలు అదుపు తప్పినా, కల్వర్టు కూలినా పెద్ద ప్రమాదమే జరుగుతుంది. ఇకనైనా అధికారులు స్పందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి.

– షేక్ హుస్సేన్, వాహనదారుడు, మీనవోలు

అదుపు తప్పితే కాల్వలోకే..



ఎర్రుపాలెం – కేశిరెడ్డిపల్లి సమీపాన రహదారిలో ఎన్నెస్పీ మేజర్‌పై కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ వాహనాలు అదుపు తప్పితే ఎన్నెస్పీ పెద్ద కాల్వలో పడే ప్రమాదముంది. ఏదైనా ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి నిర్మాణాలపై దృష్టి సారించాలి.

– కంచర్ల చంద్రమోహన్, ఎర్రుపాలెం

నివేదిక పంపిస్తాం..



నర్సింహాపురం వద్ద కల్వర్టు నిర్మాణానికి రూ.64లక్షలు మంజూరయ్యాయి. అంచనాలు సమర్పించాక టెండర్ ప్రక్రియ మొదలవుతుంది. కేశిరెడ్డిపల్లి వద్ద కల్వర్టు నిర్మాణానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాల్సి ఉంది. ఈ పనులకు నిధులు మంజూరు కాలేదు.

– టి.సాంబశివరావు, జలవనరుల శాఖ, డీఈ

ఇరుకు వంతెనలతో ఇక్కట్లు

ముదిగొండ: దశాబ్దాల క్రితం ఇరుకుగా నిర్మించిన వంతెనలు శిథిలమయ్యాయి. చాలా చోట్ల రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. అడుగు భాగాన చువ్వలు బయటకు తేలి కనిపిస్తున్నాయి. అలాంటి వంతెనలపై ప్రయాణికులు, వాహనదారులు భయం భయంగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. ముదిగొండ మండలంలోని పలుచోట్ల సాగర్ కాల్వలపై ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. ఈ వంతెనల మీదుగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, పలు వాహనాలు వెళ్తుంటాయి. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పాత వంతెనల స్థానంలో మరింత విశాలంగా కొత్త వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.

ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయంటే..



చిరుమర్రి - పమ్మి - అనాసాగరం వెళ్లే దారిలో ఇరుకు వంతెన

- ముదిగొండ మండలం మేడేపల్లి సమీపాన సాగర్ కాల్వపై వంతెన రక్షణ గోడ ఓ వైపు కూలిపోయింది. దీని పైనుంచి మేడేపల్లి, యడవల్లి, కట్టకూరు, మాదాపురం గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తారు.
- చిరుమర్రి – కట్టకూరు సమీపాన దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెన శిథిలమైంది.
- పమ్మి – నేలకొండపల్లి మండలం అనాసాగరం మధ్య ఉన్న వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి.

ఇబ్బందిగా వెళ్లాల్సిందే..



ఇరుకు వంతెన దగ్గర వాహనదారులు ఇబ్బంది పడాల్సిందే. వంతెనల పైనుంచి ట్రాక్టర్లు, బస్సులు, లారీలు వెళ్లాలంటే కష్టం ఉంటుంది. ఎదురుగా ఏదైన వాహనం వస్తే వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు కొత్త వంతెనల నిర్మాణానికి చొరవ చూపాలి.

– ఎరబోలు వేణుగోపాల్‌రెడ్డి, మాధాపురం

ఇరుక్కుపోతున్నాయి..



చిరుమర్రి సాగర్ కాల్వలపై నిర్మించిన రెండు వంతెనలు ఇరుకుగా మారాయి. దీంతో పలుమార్లు వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతులు సమర్పించాం. రెయిలింగ్ విరిగి ప్రమాదస్థాయికి చేరినందున ఇకనైనా స్పందించాలి.

– నల్లగొండ ఎల్లేశ్వరరావు, చిరుమర్రి

క్లుప్తంగా

చివరి భూములకు నీరు అందించాలని ధర్నా

తల్లాడ: ఎన్నెస్పీ పరిధిలో చివరి భూములకు సైతం సాగునీరు అందించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యాన గురువారం తల్లాడ జల వనరుల శాఖ సబ్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ మాట్లాడుతూ వైరా ప్రాజెక్ట్ నాలుగోనంబర్ కాల్వలో చెత్త పేరుకుపోవడంతో నీరు అందడం లేదని తెలిపారు. నాయకులు మాచర్ల భారతి, శీలం సత్యనారాయణరెడ్డి, కళ్యాణం కృష్ణయ్య, అయినాల రామలింగేశ్వర్‌రావు, వులి కృష్ణయ్య, ఫకీరమ్మ, ఆదూరి జీవరత్నం, నన్నే సాహెబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి మృతికి సంతాపం

మధిర: ఖమ్మంలోని వినియోగదారుల ఫోరం జూనియర్ అసిస్టెంట్ రావిరాల శ్రీనివాసరావు (57) స్వగ్రామమైన మధిర మండలం చిలుకూరులో మృతి చెందారు. గతంలో ఆయన ఎర్రుపాలెం మండలంలో వీఆర్వోగా పనిచేశారు. ఆయన మృతదేహం వద్ద వినియోగదారుల ఫోరం ఉద్యోగులు నివాళులర్పించారు.

గుండెపోటుతో సొసైటీ మాజీ అధ్యక్షుడు..

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి సొసైటీ మాజీ అధ్యక్షుడు శీలం రాఘవరెడ్డి(61) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాఘవరెడ్డి మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సత్తుపల్లిరూరల్: మండలంలోని సత్యనారాయణపురానికి చెందిన ధరావత్ మహేష్ పిడుగుపాటుతో మృతి చెందగా గురువారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నివాళులర్పించారు. అంబేద్కర్‌నగర్‌లో మృతి చెందిన ఆశా కార్యకర్త వెంకటమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకర్‌రావు, చాంద్, వల్లభనేని పవన్ పాల్గొన్నారు.

సొంతంగా మరమ్మతులు



శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు

ఏన్కూరు: మండలంలోని తిమ్మారావుపేట ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి ఇటీవల వర్షాలతో బురదమయంగా మారింది. దీంతో ఇబ్బంది ఏర్పడగా గ్రామస్తులే సొంతంగా కంకర తెప్పించి బాగు చేసుకున్నారు.

అటవీ ఉద్యోగుల సేవలు మరువలేనవి..

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, సబ్ కలెక్టర్ అజయ్, ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: ప్రాణాలను ఫణంగా పెట్టి అటవీ సంపదను సంరక్షిస్తూ విధుల్లో అమరులైన ఉద్యోగుల సేవలు మరువలేనివని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. సత్తుపల్లి డింబర్ డిపో ఆవరణలో గురువారం అటవీ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించగా అమరవీరుల స్తూపం వద్ద ఆమె నివాళులర్పించి మాట్లాడారు. అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూనే అటవీ సంపదపై ఆధారపడిన ప్రజలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ మాట్లాడుతూ అడవుల సంరక్షణలో ఉద్యోగుల సేవలు కీలకమని అభినందించారు. అనంతరం బేస్‌క్యాంప్ సిబ్బందికి రెయిన్ కోట్లు, టార్చిలైట్లు అందజేశారు. ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల, రేంజర్లు స్నేహలత, ఉమ, మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్, ఏసీపీ రఘు, డీఆర్‌ఓలు రాంసింగ్, శ్రీను, నాయకులు తోట సుజలరాణి, నాగులమీరా, చల్లగుళ్ల నర్సింహారావు, ఎం.డీ.కమల్‌పాషా, పింగళి సామేలు, చల్లగుండ్ల కృష్ణయ్య, గఫార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన గ్రామస్తులు

కారేపల్లి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇటీవల కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న పేరుపల్లి కాంప్లెక్స్ పరిధి ఉపాధ్యాయులను గ్రామస్తులు గురువారం సన్మానించారు. ఎంఈఓ దుగ్గిరాల జయరాజు, పేరుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బానోతు శ్యాంలాల్, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం రామకృష్ణ, హిందీ పండిట్ మాలోతు రాములును సన్మానించి వారి సేవలను కొనియాడారు. గ్రామస్తులు మల్లెల నాగేశ్వరరావు, బానోతు వీరభద్రం, బోళ్ల రమేష్, రాయల శ్రీనివాసరావు, పప్పుల నిర్మల, బచ్చలకూరి ఉపేందర్, పాటమ్మ నాగేంద్రబాబు, గ్రామ కార్యదర్శి సురేష్, సీహెచ్‌ఓ మాధవి, ఏఎన్ఎంలు కృష్ణవేణి, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు విజయ, దేగమాంబ, ఉపాధ్యాయులు నందిని, చెన్నయ్య పాల్గొన్నారు.

పీజీ ఎంట్రన్స్‌లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ

కొణిజర్ల: ఇటీవల విడుదలైన కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్(సీపీజీఈటీ) ఫలితాల్లో కొణిజర్ల మండలం ని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. గణిత విభాగంలో ఎం.కావ్య 55వ ర్యాంకు, ఫిజిక్స్‌లో బి.ఇందు 113, స్టాటిస్టిక్స్‌లో ఎస్.అమీషా 326, బి.సంధ్య 473, బోటనీలో కె.సంగీత 430, హిస్టరీలో సీహెచ్.శ్రావణి 526వ ర్యాంకుతో పాటు మరో 54 మంది బాలికలు ఉత్తమ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ కె.రజిని తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, కోఆర్డినేటర్లు దీప్తి, ఐశ్వర్య, రజిత, రాజేశ్వరి అభినందించారు.

గురుకులంలో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఉపేంద్రయ్య

కొణిజర్ల: కొణిజర్ల మండలం అమ్మపాలెంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను గురువారం ఎంపీడీఓ ఉపేంద్రయ్య తనిఖీ చేశారు. స్టోర్‌రూంలో సరుకులు, వంటగది, డైనింగ్ హాల్, డార్మిటరీలను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు.

కష్టసుఖాల్లో అండగా నిలుస్తా..

కారేపల్లి: ప్రజల కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని వైరా మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల చెందిన వారి కుటుంబాలను గురువారం పరామర్శించిన ఆయన బాజుమల్లాయిగూడెంలో అనారోగ్యానికి గురైన నున్నా కాంతయ్యను పరామర్శించి మాట్లాడారు. మాజీ ఎంపీపీ మాలోతు శకుంతల, బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం నాయకులు ఆర్.శ్రీనివాసరావు, మంగీలాల్, కిషోర్, శంకర్, వీరన్న, అజ్మీరా బిక్కులాల్, శ్రీనివాసరావు, నరేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ



అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారావు, జయశంకర్

వైరా: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వైరా మండల నూతన కమిటీ వివరాలను గురువారం పైడిపల్లి సత్యనారాయణ వెల్లడించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చల్లా కృష్ణారావు, మాచర్ల జయశంకర్ ఎన్నికయ్యారని తెలిపారు. కోశాధికారిగా సామినేని వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా షేక్ వలీజాన్, ఉపాధ్యక్షుడిగా ఎన్.పెంటయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె.సరస్వతి, కార్యదర్శులుగా జి.సుబ్బయ్య సీహెచ్‌వీఎస్.ప్రసాద్, కొల్లిపర శారదాదేవి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా నూతకాని ప్రసాద్, జీ.వీ.కృష్ణారావు, పి.నరసింహారావు ఎన్నికయ్యారు.

ఉన్నత స్థానాలకు చేరాలి



మాట్లాడుతున్న హెచ్ఎం శ్రీనివాసరావు

చింతకాని: విద్యార్థులు శ్రద్ధగా చదువుతూ ఉన్నత స్థాయికి చేరాలని మండలంలోని మత్కేపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం గండేపల్లి శ్రీనివాసరావు సూచించారు. పాఠశాల పదో తరగతి విద్యార్థులకు జీఎస్ఎం స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన పరీక్షా సామగ్రిని గురువారం ఆయన అందజేశారు. పూర్వ విద్యార్థులు సంకెళ్ల వినయ్‌తో పాటు కోట వెంకటరమణ, బోడ ప్రవీణ్, వరగాల వేణు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులు పడిగాపులు

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి సొసైటీ పరిధి రైతులు యూరియా కోసం గురువారం పడిగాపులు కాశారు. ఇక్కడకు 580 బస్తాల యూరియానే రావడంతో కొరత ఏర్పడింది. దీంతో ఎస్ఐ వెంకటేష్ చేరుకుని కూపన్ల ఆధారంగా ఉన్నంత వరకు పంపిణీ చేయించారు.

ఉన్నత లక్ష్యంతో చదివితే ఫలితాలు

సత్తుపల్లిరూరల్: తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ మట్టా దయానంద్ సూచించారు. సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మార్కెట్ చైర్మన్ దోమా ఆనంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపితో పాటు గాదె చెన్నారావు, చల్లారి వెంకటేశ్వరరావు, సుధాకర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని నేరడలో గొర్రెముచ్చు నవీన్, పగిళ్లపల్లి ఉప్పలయ్యకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫారసుతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు అందజేశారు. నాయకులు మంకెన నాగేశ్వరరావు, చెవుల తిరుపతిరావు, దస్తగిరి, రవి, సీతారాములు, వెంకట్రావు, పుల్లయ్య, గురవయ్య, వీరబాబు, ఉపేందర్ పాల్గొన్నారు.

మొక్కలతో వాతావరణ సమతుల్యత

మధిర: మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పచ్చదనం పెరిగి వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని పలువురు పేర్కొన్నారు. మండలంలోని రొంపిమళ్ళ చర్చి ప్రాంగణంలో పాస్టర్ పెలోషిప్ ట్రస్ట్ ఆధ్వర్యాన గురువారం మొక్కలు నాటారు. ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు దేవరాజు, జి.దయాకర్‌తో పాటు ఆదమ్ ఎలీషా, టి.జీవరత్నం, తిమోతి, డేవిడ్ వీరయ్య, సురేష్, లంకా కొండయ్య, అనిత గ్రేస్ పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణ పరీక్షలు

తల్లాడ: మండలంలోని నూతనకల్‌లో గురువారం టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి ప్రత్యూష, ఉద్యోగులు వేణుగోపాల్, కె.పెద్ద పుల్లయ్య, రాంబాబు, సురేష్, ఆర్.సంజీవ్ కుమార్, శ్రావణసంధ్య పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలని ధర్నా



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు

కల్లూరు: రూ.10వేల వేతన హామీని అమలు చేయాలనే డిమాండ్‌తో సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఐకేపీ వీఓఏలు గురువారం ధర్నా చేశారు. వీఓఏల సంఘం జిల్లా కన్వీనర్ వేము నాగమణి మాట్లాడగా వి.రాంబాబు, దయాకర్‌రావు, రజిత, లలిత, వెంకట్రావమ్మ, కృష్ణవేణి, మరియమ్మ, మల్లిక, కోటేశ్వరి, దేవమి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

బోనకల్: ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని వైద్యాధికారి స్రవంతి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో స్థానికులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు ప్రియాంక, రవళి, సాయిలక్ష్మి, కావ్య, ఉద్యోగులు స్వర్ణమార్త, శోభారాణి తదితరులు ల్గొన్నారు.

14న చలో కొత్తగూడెం

తల్లాడ: కొత్తగూడెంలో ఈనెల 14న జరిగే లంబాడీల ర్యాలీని విజయవంతం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గుగులోతు కృష్ణనాయక్ కోరారు. తల్లాడ మండలం మల్సూర్‌తండాలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ ఉప తెగల మధ్య అనిశ్చితికి తెర దించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్, నాయకులు భూక్యా రవినాయక్, నందు నాయక్, శ్రీనునాయక్, బాలనాయక్, రాము నాయక్, భద్రునాయక్, దేవీలాల్, మోహన్, రాజా తదితరులు పాల్గొన్నారు.

వసూలుదారులపై చర్యలు తీసుకోవాలి

చింతకాని: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక తీసుకెళ్లే ట్రాక్టర్ డ్రైవర్ల వద్ద పట్టా భూముల పేరిట డబ్బు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందించి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్రా ఉపేందర్, నాయకులు గుండ్ల రాంబాబు, చాట్ల రాజేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

కల్లూరురూరల్: కల్లూరు మండలం ఎర్రబోయినపల్లిలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం జీపీ ఎదుట ఆందోళన నిర్వహించగా నాయకుడు తన్నీరు కృష్ణార్జున్‌రావు మాట్లాడారు. నాయకులు దోమతోటి పుల్లయ్య, తిగుళ్ల బాబు, శీలం స్వామి, రాములు, బీరవెల్లి బాబు పాల్గొన్నారు.

పాఠశాలలో దాతలకు సన్మానం

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.30 వేల విలువైన సౌండ్ సిస్టం, రూ.21వేల విలువ చేసే సైన్సు ల్యాబ్ సామగ్రిని గ్రామానికి చెందిన ముక్కర సంజీవరెడ్డి, పిల్లి బోస్ ఇటీవల అందజేశారు. ఈ సందర్భంగా గురువారం వీరిని హెచ్ఎం బి.మురళీమోహన్ రావు, మార్కెట్ డైరెక్టర్ వేమిరెడ్డి అనురాధ, సొసైటీ చైర్మన్ కుడుముల మధుసూదన్‌రెడ్డి సన్మానించారు. ఈకార్యక్రమంలో షేక్ జానీ బాషా, రావూరి రాంబాబు, మారపోగు జమలయ్య, బలుసు అనిల్, శీలం అంజిరెడ్డి, కర్నాటి నాగిరెడ్డి, గుర్రాల సంగిరెడ్డి, కుడుముల శ్రీనివాసరెడ్డి, షేక్ ఇస్మాయిల్, షేక్ ఉద్దండు పాల్గొన్నారు.



దాతలు, సామగ్రితో పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు

ఉవ్వెత్తున సాగిన సాయుధ పోరాటం



మధిర : మాట్లాడుతున్న సీపీఐ నాయకులు



బోనకల్ : జానకిరామయ్య స్మారకస్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మధిర/బోనకల్: మధిర ప్రాంతంలో తెలంగాణ సాయుధ పోరాటం ఉవ్వెత్తున జరిగిందని.. హింస, వెట్టిచాకిరి, అణచివేతపై ప్రజల్లో చైతన్యమే తెలంగాణ సాయుధ పోరాటానికి కారణమైందని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు బెజవాడ రవిబాబు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు మండలంలోని తొండల గోపవరంలో నల్లమల గిరిప్రసాద్ స్మారక స్తూపం వద్ద గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రవిబాబు, నాయకులు ఎంఏ.రహీం, ఊట్ల కొండలరావు మాట్లాడుతూ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర మరువలేనిదని తెలిపారు. మధిర నియోజకవర్గంలో ప్రతీ ఊరు నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమించిందని, మధిర మండలం అల్లీనగరం వాసులు రజాకార్లను తరిమి తరిమి కొట్టారని చెప్పారు. ఇక బోనకల్ మండలం చిరునోములలో తామ్రపత్ర గ్రహీత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావెళ్ల జానకిరామయ్య స్తూపం వద్ద సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు మాట్లాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కొనసాగిందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు పెరుమాళ్లపల్లి ప్రకాష్‌రావు, మంగళగిరి రామాంజనేయులు, చెరుకూరి వెంకటేశ్వర్లు, మడుపల్లి లక్ష్మణ్, తలారి రమేష్, కొండూరి నాగేశ్వరావు, రంగు నాగకృష్ణ, పరుచూరి రాము, గోపి, తూము రోషన్‌కుమార్, బోళ్ల ప్రసాద్‌రావు, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, గుంపుల జయరాజు, కృష్ణారావు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మహబూబ్ పాషా

మధిర: సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 13న జిల్లా కేంద్రంలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. మధిరలోని మానవ వనరుల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 సెప్టెంబర్ 13న ఆనాటి పీసీసీ చీఫ్, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ రెండేళ్లు గడిచినా సమస్యలు పరిష్కరించనందున 13వ తేదీన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, గత ఏడాది డిసెంబర్‌లో సమ్మె చేయగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. సంఘం మండల అధ్యక్షుడు మల్లికార్జున్‌తో పాటు మీరా, రమేష్, సునీత, మేరీ రాణి, ఇంద్రకళ, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలపై ఆరా



కాలనీలో పరిశీలిస్తున్న డీపీఓ, అధికారులు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం దళిత కాలనీలో సమస్యలను డీపీఓ ఆశాలత, మండల అధికారులు గురువారం పరిశీలించారు. కాలనీలోని పలువురి ఇళ్లలోకి వర్షపు నీరు చేరి ఇబ్బందులు ఎదురవుతున్నాయని బీజేపీ నాయకులు ఆపతి వెంకటరామారావు ఇటీవల కలెక్టర్‌ను వినతిపత్రం సమర్పించారు. దీంతో డీపీఓ కాలనీలో పర్యటించి సమస్యలను గుర్తించారు. రోడ్డుకిరువైపులా హద్దుల గుర్తింపు, డ్రెయినేజీలకు సిమెంట్ లైనింగ్, అవసరమైన చోట డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదిస్తామని ఆమె తెలిపారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, ఎన్నెస్పీ ఏఈ అయేషా, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లుతో పాటు తుమ్మలపల్లి రమేష్, ఎల్లంకి సుదాకర్, ఇస్నేపల్లి కృష్ణార్జున్, భవాని, నరేష్, బాబు, పేతురు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

కల్లూరురూరల్: సత్తుపల్లి కోర్టులో ఈనెల 13న జరిగే లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవాలని కల్లూరు ఎస్సై హరిత సూచించారు. ఇరుపక్షాల వారు పరస్పరం రాజీపడి కేసు పరిష్కరించుకుంటే సమయం ఆదా అవుతుందని తెలిపారు. లోక్ అదాలత్‌కు సంబంధించి సమాచారం కోసం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

చినుకు పడితే చిత్తడే..



బురదమయంగా మారిన రోడ్డు

మధిర: మధిరలోని లడక బజార్‌లో అయ్యప్ప స్వామి ఆలయానికి వెళ్లే మార్గం బురదమయమై అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఇదే రహదారిలో మున్సిపల్ సిబ్బంది కూడా పంపింగ్ వెల్ వద్దకు రాకపోకలు సాగిస్తుండగా.. ఆలయానికి వెళ్లే భక్తులు, రైతులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. లడకబజార్ మెయిన్ రోడ్డు నుంచి అయ్యప్ప స్వామి గుడి వరకు అభివృద్ధి పనుల కోసం రహదారిని తవ్వి వదిలేయడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడ అనువుగా లేక ఇటీవల పలువురు జారిపడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.